
ఆంధ్రభూమి దినపత్రిక వారి కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

# ఓ సీత కథ



"సీతామనోహరి" తనని తాను పరిచయం చేసుకుంటూ అంది.

ఫణీష్ అదోలా చూసి భుజాలెగరేస్తూ నవ్వాడు.

"అదేం పేరు?"

"అదే నా పేరు" ధీమాగా చెప్పింది.

"బావో లేదు. మీ అందం మీ పెర్సనాలిటీ మీ ఒంపు సొంపుల్ని బట్టి రంభ అనో రతీదేవి అనో పెట్టి ఉండాల్సింది"

"మీ అమ్మాయికి పెట్టుకుందురు గాని.........."

దెబ్బతిన్నట్టు చూశాడు. ఆ వెంటనే సర్దుకున్నాడు "అహహ. నన్నపార్థం చేసుకో వద్దు. నా ఉద్దేశం ఏవిటంటే సీత పేరు పెట్టుకున్న వారందరికీ కష్టాలు తప్పవంట"

"కష్టాలని ఎదుర్కోగల శక్తి వుంది. అందుకే ఈ జనారణ్యంలోకి రాగలిగాను"

"మీ స్పాంటేనిటీ నాకు నచ్చింది. స్పార్క్ ఉన్న మీలాటి వాళ్ళు నా ప్రాజెక్టులో ఉన్నందుకు ప్రాజెక్టు మేనేజరుగా అయామ్ వెరీ హ్యాపీ........"

"థాంక్యూ......"

మరో మాటకవకాశం ఇవ్వకుండా వెనుదిరిగి వెళ్ళిపోయింది.

ఆమె జఘన సౌందర్యం మరింతగా మతి పోగొడుతోంటే పెదవి కొరుక్కుంటూ ఆమె వెళ్ళినవైపే చూస్తూండిపోయాడు ఫణీష్.

'ఎలాగైనా ముగ్గులోకి దింపాలీ ముద్దుగుమ్మని' అనుకొంటోంటే, "ఏంటి గురూ ఏదో సీరియస్‌గా ఆలోచిస్తున్నావ్" అంటూ వచ్చాడు ఆడ్మిన్ మూర్తి.

"సీమ కుట్టింది"

"చీమ?"

"ఊహుఁ సీమ......సీతా మనోహరి......"

"టఫ్ గాళ్"

"నాకు మైనపు బొమ్మే"

"నీ టాక్టిక్స్ వేరు. గాళ్స్‌ని పడేయడంలో నీకు మాస్టర్స్ డిగ్రీ ఉంది...."

గర్వంగా నవ్వేడు ఫణీష్ తన ఫ్రెంచి గెడ్డాన్ని నిమురుకుంటూ.

ఫణీష్ స్టైలుగా ఉంటాడు. ట్రెండీ దుస్తులు ధరిస్తాడు. స్మైలింగ్ ఫేస్. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో చక్కని పొజిషన్లో  ఉన్నాడు. కంపెనీ హయ్యర్ అప్స్ గుడ్ లుక్స్‌లో ఉన్నాడు. అమ్మాయిల సంతోషం కోసం రెక్లెస్‌గా డెబిట్ కార్డుని ఉపయోగిస్తాడు. వీటన్నిటివల్లా తను అమ్మాయిల కలల మన్మథుడని భావిస్తూంటాడు.

ఆల్ ది బెస్ట్ చెప్పి వెళ్ళిపోయాడు మూర్తి.

*    *    *

సీతా మనోహరి తన ఫ్రెండ్స్‌తో కలిసి క్యాంటీన్‌కెళ్ళడం చూశాడు ఫణీష్. చేస్తున్న పనిని ఆపి లేచాడు.

క్యాంటీన్లో డ్రమ్ చికెన్ ప్లేటు తీసుకుని తింటూ అప్పుడే ఆమెని గమనించినట్టు "హాయ్ సీమా" అంటూ విష్ చేశాడు.

సీతా మనోహరే కాదు ఆమె స్నేహితులూ తుళ్ళిపడి చూశారు.

"అరె. అలా చూస్తున్నారేంటి. టేకిట్ ఈజీ. స్టైల్‌గా వుంటుందని నీ నేమ్ ట్రిమ్ చేశా? ఈజిట్ ఓకే?"

"నాట్ ఓకే. నన్ను పిలవాలనుకుంటే సీతామనోహరి అనే పిలవండి"

ఆమె గట్స్‌కి అదిరి పడ్డాడు.

ఆఫ్టాల్ నిన్నగాక మొన్న చేరిన అమ్మాయి ప్రాజెక్ట్ మేనేజర్‌కి ఎదురు చెబుతోంది. ఎంత ధైర్యం!

వెర్రిగా నవ్వి మాట మార్చాడు "వెజ్ శాండ్ విచ్ అంటే గడ్డీగాదం తినడమే. డ్రమ్ చికెన్ అదిరిపోతోంది. ఒక ప్లేటు తెచ్చేదా?"

"సారీ. థాంక్స్.....నేను ఎన్వీ తినను"

"ఓహో. మనిషి మెదడునే తింటారన్నమాట" అదో జోక్ అయినట్టు పెద్దగా నవ్వాడు.

"యస్. కొందరి మెదడ్ని ఫ్రై చేసుకునీ మరి కొందరి మెదడ్ని ఆమ్లెట్‌గా వేసుకునీ తింటాను. మీకేమైనా అభ్యంతరమా?"

అతడి ముఖంలోని రక్తం అమాంతం  నీరుగారిపోయింది. ఆమె ఫ్రెండ్స్ నవ్వుని బిగబట్టుకుంటున్నారు.

'డామిట్ !' అనుకుంటూ గబగబా వెళ్ళి గ్లాసుడు నీళ్ళు గడగడా తాగేశాడు.

*    *    *

ఆరయ్యింది.

సీతామనోహరి బ్యాగ్ సర్దుకొంటోంటే ఫణీష్ ఫోన్ చేశాడు. "ఎయిట్‌కి యు ఎస్ క్లయింట్ కాల్ చేస్తానన్నాడు. వెయిట్" అన్నాడు.

"మా టీమ్ లీడ్ ఉంటాడుగా"

"నీతోనే మాట్లాడాలంట. నీ వర్క్ రిలేటెడ్......" మరో మాటకవకాశం ఇవ్వకుండా లైను కట్ చేశాడు.

అసహనంతో మండింది. చాలా ప్రోగ్రాములు వేసుకుంది. ఓ మిత్రురాలి కూతురి బర్త్‌డేకి వస్తానని మరీ మరీ ప్రామిస్ చేసింది. అంతా అప్‌సెట్టయ్యింది. అదీగాక క్లయింటుకి తనతో మాట్లాడాల్సినంత అవసరం ఉండదు. మధ్యలో ఫణీష్ పెట్టిన ఫిట్టింగ్ అయ్యుంటుం దనుకునే సరికి మొహం ఎర్రబడింది. మరికాస్సేపటికే అంతః సంఘర్షణ అణిగిపోయింది. ఎప్పటి మనిషిలా అయిపోయింది. పనిలో పడింది.

ఎనిమిదయ్యింది. ఎనిమిదిన్నరయ్యింది. తొమ్మిదయ్యింది. తొమ్మిదన్నరవుతోంది. క్లయింట్ కాల్ రాలేదు. ఫణీష్‌కి ఫోన్ చేసింది.

"నేనే నీకు కాల్ చేద్దామనుకుంటున్నాను. ఇంతలో నువ్వే చేశావు. క్లయింట్ వేరే బిజీలో వున్నాట్ట. జస్ట్ టూ మినిట్స్ బ్యాక్ చెప్పేడు. నౌ యుకెన్ లీవ్......లిఫ్టివ్వనా?"

"నో థాంక్స్. క్యాబ్ ఉంది......"

ఆమె జవాబులో 'పొగరు' కన్పించిందతడికి.

'ముందు ముందు తెలుస్తుంది నేనేమిటో !' అనుకున్నాడు తనలో తను మండుతూ.

మరి వారం తర్వాత సీతామనోహరి నిలబడి ఎవర్తోనో ప్రాజెక్టు గురించి డిస్కస్ చేస్తోంటే చూశాడు ఫణీష్.

టైట్ జీన్స్‌లో వున్న ఆమె వెనుక సౌందర్యం అతడ్ని నిలవనీయలేదు. ఏమీ ఎరగ నట్టుగా వెళ్ళి ఆమె పిరుదుల మీద చిన్నగా చరిచి "హాయ్" అని విష్ చేస్తూ నవ్వాడు.

ఆమె మాడ్చేసేలా చూసింది. కొలీగ్స్ సైతం నివ్వెరపోయి అతడ్నేమీ అనలేక ఇబ్బందిగా చూస్తూండిపోయారు.

"ఓ మీరా. మీరనుకోలేదు.......సారీ......"

"మీ చదువు సంస్కారాన్ని నేర్పలేకపోవడం శోచనీయం"

"పెద్ద మాటలూ కొటేషన్లూ వద్దు సీతాదేవీ. పొరబాటైందని చెప్పేనుగా. క్షమించండి కాని శపించకండి" అన్నాడు తేలిగ్గా నవ్వేస్తూ.

సీత నిరససగా చూసి విసవిసా అక్కడ్నుంచెళ్ళిపోయింది.

"సరదా సీన్ని సీరియస్ చేస్తుందేవిటీ అక్కడికి తనేదో పతివ్రత అయినట్టు!" మిగతా వారితో అన్నాడు.

వారెవరూ బదులివ్వలేదు. తమ తమ సీట్లలోకెళ్ళిపోయారు.

"నా ప్రాజెక్టు మెంబర్సందరికీ ఓ గుడ్ న్యూస్. మన కంపెనీ సీఈఓ నన్ను లంచ్‌కి పిలిచి మరీ అభినందించారు. ప్రాజెక్ట్ ప్రోగ్రస్‌కి క్లయింట్ ఫుల్ హ్యాపీ అట. నేను రికమండ్ చేసిన కొందర్ని ఆన్‌సైట్‌కి పంపిస్తానని ప్రామిస్ చేశారు. మీలో ఆ అదృష్టాన్ని చేజిక్కించుకునేదెవరో చూద్దాం" సీత వంక ఓరకంట చూస్తూ అన్నాడు.

కొందరు ముందుకొచ్చి అతడ్ని అభినందించారు. వారిలో సురేష్ కూడా ఉన్నాడు.

* * *

"సీతా మనోహరీ! నువ్వు వెళ్ళే ముందు కాల్ చెయ్యి టెన్ మినిట్స్ నీతో పెర్సనల్‌గా మాట్లాడాలి" ఫోన్లో చెప్పేడు ఫణీష్.

"పెర్సనల్ విషయమా?"

"నో యార్. అఫీషియలేగాని కాన్ఫిడెన్షియల్. కెఎఫ్‌సిలో వద్దుగాని సబ్‌వేలో కూర్చుందాం"

"మీ క్యూబికల్లో బెటరేమో?"

"హైలీ కాన్ఫిడెన్షియల్ అని చెప్పేసుగా...సీ యూ......"

మరి అరగంటకి ఇద్దరూ సబ్‌వేలో ఎదురెదురు సీట్లలో కూర్చున్నారు.

"ఇక్కడ వెజ్‌బర్గర్ చాలా బావుంటుంది. లెటజ్ టేస్ట్......"

అతడు తేవడానికెళ్ళబోతే వారించింది "నాకేమీ వద్దు"

"నాకు ఆకలిగా ఉందే"

"మీరు తినండి"

"అది సంస్కారం కాదు"

"ఆఫర్ చేశారుగా. చాలు. యుకెన్ గో ఎహెడ్....."

బర్గర్ మీద సాస్ కుమ్మరిస్తూ "మీ మెదడునెవరో నా గురించి పొల్యూట్ చేశారు" అన్నాడు.

"వ్వాట్?"

"అయామ్ నాట్ బ్యాడ్ గై......"

"నేనలా అనలేదే"

"అన్లేదుగాని అనుకుంటున్నారు. అందుకే నన్ను దూరంగా ఉంచుతున్నారు"

"నా నేచరే అంత......లెటజ్ కమ్ టు ద పాయింట్......"

"నిన్ను ఆన్‌సైట్‌కి పంపించమని రికమండ్ చేస్తాను. నా మాట కాదనరు....."

"నాకంత ఇంట్రస్ట్ లేదు. అయామ్ హ్యాపీ హియర్"

"ఫైవ్ ఇయర్స్ సర్వీసుంటేగాని రాని అవకాశాన్ని ఒన్ ఇయర్‌కే కల్పిస్తానంటే అలా మాట్లాడుతావేంటి? అసలా ఎక్స్‌పోజర్ వేరు. ఒకసారి వెళ్ళొస్తే కెరీర్‌లో పెద్ద జంప్ వస్తుంది తెలుసా?"

"నా వర్కునీ వర్తునీ చూసి పంపిస్తే ఓకే. ఎవరి దయాదాక్షిణ్యం మీదో వెళ్ళడం ఇష్టంలేదు"

"నేను 'ఎవర్నో' ఎందుకవుతాను? మనం మనం ఒకటి......." మెల్లగా తన కాళ్ళను ఆమె కాళ్ళకు తగిలిస్తూ అన్నాడు.

ఆమె కాళ్ళు వెనక్కి లాక్కుని చురుగ్గా చూసింది. అదేమీ పట్టించుకోకుండా, "నువ్వు కొంచెం కో ఆపరేట్ చేస్తే నీకు పెద్ద లిఫ్టు ఇస్తాను......." అన్నాడు.

"నాకక్కర్లేదు........." చటుక్కున లేస్తూ అంది.

ఆమె వెళ్ళబోతుంటే చేయి పట్టుకుని లాగాడు. ఊహించని పరిణామానికి గబుక్కునొచ్చి అతడి మీద పడింది. అదే అదనుగా అతడామెని సందిట్లో బిగించి చుంబించడానికి ప్రయత్నించాడు.

అతడి పట్టు విడిపించుకుని చెంప చెళ్ళుమనిపించింది.

ఆ సౌండ్‌కి అక్కడి జనమంతా అదిరి పడి చూసారు.

"ఖబడ్దార్! ఇంకోసారిలా మిస్ బిహేవ్ చేస్తే చెప్పు తెగుతుంది జాగ్రత్త!" అందరికీ విన్పించేలా హెచ్చు స్వరంతో చెప్పి హై హీల్స్ శబ్దం చేసుకుంటూ వెళ్ళిపోయింది.

అతడి తల భూమిలోకి కూరుకుపోయింది. గుండె మాత్రం నిప్పుల కొలిమి అయింది!

* * *

"ఇవాళ మీ క్యాబ్‌లో వస్తాను మేడమ్" కొలీగ్ సురేష్ అన్నాడు సీతామనోహరితో.

అతడూ ఆమె టీమ్ వాడే. కొంచెం రిజర్వ్‌డుగా ఉంటాడు. పట్టి భయస్తుడు.

"క్యాబ్ నాది కాదు కంపెనీది" అని నవ్వి "మీ బైక్ ఏమైంది ?" అనడిగింది.

"సర్వీసింగ్‌కిచ్చాను. ఈ మధ్య తరచూ ప్రోబ్లమ్ ఇస్తోంది......దాన్ని కొని సిక్స్ ఇయర్స్ దాటింది లెండి"

ఇద్దరూ నడుస్తూ వెళ్ళి క్యాబ్ ఎక్కారు. లేట్ అవర్సవడం వల్ల వారిద్దరే ఉన్నారు.

క్యాబ్ మరో రోడ్డుకి మళ్ళటం చూసి "ఇటు వెళ్తున్నావేం?" డ్రైవర్ని అడిగింది.

"ఆ రోడ్డు రిపెయిర్లో వుంది మేడమ్" సురేష్ జవాబిచ్చాడు.

"మార్నింగ్ అటే వచ్చానే"

"తర్వాత మొదలెట్టి ఉంటారు. ఏ రోడ్డు ఎప్పుడు తవ్వేస్తారో ఎవరికీ తెలీదు. అయినా కంపెనీ ఇవ్వడానికి నేనున్నా కదా మేడమ్ డోంట్ వర్రీ........."

"అహ అందుక్కాదు.........."

"మీ గురించి ఫణీష్‌గారు చాలా గొప్పగా చెబుతూంటారు మేడమ్....." మెల్లగా అన్నాడు.

"నా గురించా నా వర్క్ గురించా?"

ఆమె సూటిగా అడిగేసరికి తడబడ్డాడు. "మీ గురించే......"

సీత మరి రెట్టించలేదు. మౌనంగా ఉండిపోయింది.

చీకటి చీల్చుకుంటూ నిర్మానుష్య ప్రదేశంలో పరుగెడుతోంది క్యాబ్.

"అదిగో ఆ చెట్టు క్రింద ఆపు దిగిపోతాను......" హఠాత్తుగా అన్నాడు సురేష్.

"ఇక్కడెందుకు?"

"ఆ వెనుక ఉన్న కాలనీలో మా రెలటివ్స్ ఉన్నారు....."

కారు స్లో అవుతోంటే కొంచెం దూరంలో రోడ్డు ప్రక్కన సిగరెట్ కాలుస్తూ నిలబడ్డ ఫణీష్ ఆమె కంట్లో పడ్డాడు. వెంటనే అలర్టయ్యిందామె.

క్యాబ్ ఆగటం, సురేష్ డోర్ తీయడం, ఫణీష్ లోపలికి రావడం క్షణాల్లో జరిగి పోయాయి.

"ఇప్పుడేం చేస్తావే" అంటూ ఆమె మీద పడ్డాడు ఫణీష్. ఆమె కదలకుండా పట్టుకోబోయాడు సురేష్.

సిద్ధంగా ఉంచుకున్న పెప్పర్ బాటిల్తో ఆ ఇద్దరి కళ్ళల్లోకీ స్ప్రే చేసింది. కళ్ళు నలుపుకుంటూ గోలపెడతోంటే డ్రైవర్ బెదరిపోయి క్యాబ్ ఆపి పరుగందుకున్నాడు.

అవతలి డోర్ తెరచుకుని నిలువెత్తు ఆత్మస్థైర్యంలా నడుచుకుంటూ వెళ్ళిపోయింది సీతామనోహరి.

ఆ ఘటన జరిగిన మూడ్రోజులదాకా వీధి ముఖం చూళ్ళేదు ఫణీష్.

అన్ని పేపర్లూ తిరగేస్తూ టీవీ న్యూస్ ఛానల్స్ చూస్తూ భయాందోళనల గుప్పిట్లో నలిగిపోతున్నాడు.

అసలవాళామె అలా మెరుపులా ఎదురు దాడి చేస్తుందని ఊహించలేదు.

అబల కదా ఇద్దరు మగాళ్ళున్నాం కదా లొంగకేంజేస్తుందనుకున్నాడు. ఆమెని శారీరకంగా లొంగదీసుకుని తద్వారా ఆమె అహాన్ని గర్వాన్ని అణచి పైచెయ్యి తనదేనని చాటుకోవాలనుకున్నాడు.

జరిగింది బయటికి చెప్పుకోలేక తనలో తను కుళ్ళిపోతుందని భావించాడు. ఆ దెబ్బకి కాళ్ళబేరానికొచ్చి పెంపుడు జంతువుగా మారిపోతుందనీ అనుకున్నాడు.

కాని ఊహించని విధంగా తప్పించుకుంది.

దెబ్బతిని తప్పించుకున్న మానీటర్లా ప్రమాదకరంగా మారుతుందనీ పోలీస్ కంప్లయింట్ ఇస్తుందనీ మీడియా ముందు గోడు చెప్పుకుని నానా గోల చేస్తుందనీ ఎక్స్‌పెక్ట్ చేశాడు.

అందుకే భయంతో వణకిపోతూ కాలు బయటపెట్టడానిక్కూడా సాహసించ లేక పోయాడు.

చిత్రంగా ఆమె సైలెంటుగా ఉండిపోయింది. ఎలాంటి రియాక్షనూ లేదు!

తనతో పెట్టుకుంటే తను మరింత పెద్ద ఘోరాన్ని తలపెట్టొచ్చని భయపడి ఉంటుందనుకున్నాడు.

'ఎంతైనా నేను ముల్లుని. మగాడ్ని. నాకేం నష్టంలేదు' అని తలెగరేసి నవ్వుకున్నాడు.

'తను బెదరి దారికొస్తే సరేసరి. లేకపోతే డ్రింకులో మత్తుమందు కలిపో మరోటి చేసో తెలివిగా ట్రాప్ చెయ్యాలి. ఈసారి చచ్చినా గురి తప్పకూడదు' అనుకుంటూ హుషారుగా ఏదో పాట హమ్ చేస్తూ ఆఫీసుకెళ్ళాడు.

గేటు దగ్గర ఐడీ స్వైప్ చేస్తోంటే ఒకామె "హాయ్ రావణ్" అంటూ పలకరించింది.

అదిరిపడి చూశాడు. ఆమె నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. తను పొరబడ్డాడని సరిపెట్టుకుంటూ మరో నాలుగడుగులేశాడో లేదో, "రావణ్! నైస్ నేమ్ సెలక్ట్ చేసుకున్నారు. ఆల్ ద బెస్ట్' అందింకొకావిడ.

కళ్ళు గిర్రున తిరిగాయి ఫణీష్‌కి.

ఏం జరిగింది? ఏం జరుగుతోంది? ఇంకేం జరగబోతోంది?

నోటి తడారిపోయింది. ఆఫీసు లోపలికెళ్ళాలంటే కాళ్ళు వణికాయి. చుట్టూ అనుమానంగా చూస్తోంటే ఎడ్మిన్ మూర్తి వచ్చాడు "ఏమైపోయావు గురూ" అంటూ.

"ఏమీ అవ్వలేదుగాని అంతా నన్ను రావణ్ అంటున్నారేంటి?"

"నువ్వూ సురేషూ రావణ మారీచులంటూ పేర్లు మార్చుకున్నార్టగా"

"ఎవరు చెప్పేరు?"

"మూడ్రోజుల క్రితం నోటీసుబోర్డులో మీ ఫోటోలు పెట్టి.........!"

'మైగాడ్!' కసిగా పెదవి కొరుక్కున్నాడు.

"ఏమైంది?"

"ఆ సీతా మనోహరి బిలో ది బెల్ట్ దెబ్బ కొట్టింది"

"ఆఫ్టాల్ ఒక ఆడపిల్ల......"

"ఆడపిల్ల కాదు అగ్గిపుల్ల. ఆడ రాముడు !"

"నాకేం అర్థం కావట్లేదు"

"నేను పంజా విసిరేక తను గిలగిల కొట్టుకుంటుంది చూడు అప్పుడర్థమవు తుందిలే"

విసురుగా లోపలికి నడిచాడు. మగ కొలీగ్సంతా తలలు తిప్పుకోవడం చూసి నుదురు చిట్లించాడు.

సీట్లో కూర్చోబోతోంటే ఆఫీసులోని ఆడవాళ్ళంతా వానరసైన్యంలా బిలబిలమంటూ వచ్చారు.

ఒంట్లోని రక్తమంతా వేగంగా విరిగిపోతోంటే గుటకలు మ్రింగుతూ చూసాడు.

అంతా తలొక ముల్లూ తెచ్చి అతడికిచ్చి వెళ్ళిపోయారు.

కాళ్ళ క్రింది భూమి కంపిస్తోంటే సన్నగా కంపిస్తూ బెరుగ్గా చూస్తూండిపోయాడు.

ఆ పిమ్మట మొదలయ్యాయి ఫోన్ మీద ఫోన్లు.

"రావణ్ గెటప్ అదిరింది. ఫేస్ బుక్‌లో చూశాం" అంటూ మిత్రులూ, మిత్రుల మిత్రులూ, మిత్రుల మిత్రుల మిత్రులూ ఒకటే ఫోన్లు.

గబగబా ఫేస్‌బుక్ ఓపెన్ చేశాడు.

తన ఫోటో పెట్టి దారుణమైన కామెంట్లు చేశారు-అంతా ఆడవారే. విదేశాల్లో ఉన్న వాళ్ళు కూడా!

నవనాడులూ కృంగిపోయాయి.

యుద్ధం మొదలుపెట్టకుండానే దారుణంగా ఓడిపోయిన వాళ్ళా అయిపోయాడు.

ఈ గొడవంతా కంపెనీ హయ్యర్ అప్స్‌కి తెలిసి ఉంటుందా? ఎలాటి చర్య తీసుకుంటారో!

వెన్నులో భయం పాము జరజర పాకింది. నలుగురికీ చెప్పుకుంటే అవమానం అని సీత తనలో తానే కుళ్ళిపోతుందనుకున్నాడుగాని ఇలా 'గీత' దాటి సోషల్ నెట్‌వర్కింగ్‌లో ప్రవేశించి కల్లోలం సృష్టిస్తుందనుకోలేదు!

సరిగ్గా అప్పుడు హెచ్చార్ నుంచి మెయిల్ వచ్చింది. "యూ ఆర్ డిస్‌మిస్డ్ విత్ ఇమీడియట్ ఎఫెక్ట్......"

తల పట్టుకున్నాడు.

ఇంతలో ఇంకెవరో తిన్నగా అతడి సీటు దగ్గరికొచ్చాడు. అప్రయత్నంగా లేచి నిలబడ్డాడు ఫణీష్. అతడెళ్ళి ఫణీష్ ఖాళీ చేసిన సీట్లో కూర్చుని పనిలో పడ్డాడు.

ఇక తనకీ ఆఫీసులో స్థానం లేదు! ఫ్రెండ్స్ సర్కిల్లోనూ లేదు! వార్త బయటికి పొక్కితే సభ్యసమాజంలోనూ.......!

అతడి దిమ్మ తిరిగిపోతోంది కంటికి కన్పించని దెబ్బకి!

ఇంకెలా బతకాలి?

తలొంచుకుని నిస్త్రాణగా బయటికి నడిచాడు.

సెక్యూరిటీ వాళ్ళు ఐడీ తీసేసుకున్నారు. గేటు దాటబోతూ బయటికి చూశాడు.

రోడ్డుకవతల 'ఫణీష్‌ని శిక్షిస్తాం' అంటూ ప్లకార్డులు ధరించి ఆడజనం! వాళ్ళు అబలల్లా లేరు చరిత్ర గతిని మార్చేసే వైతాళికుల్లా ఉన్నారు!

లోపలికి పారిపోబోయాడు గాని సెక్యూరిటీ వాళ్ళు గేటు బయటికి తోసేశారు.

వెళ్ళి నడిరోడ్డు మీద పడ్డాడు. ఆడవాళ్ళు అగ్నికెరటాలై ఉప్పొంగి అతడి మీదకి రాసాగారు.

ఆఫీసు పై అంతస్తు అద్దంలో నుంచి ఆ దృశ్యాన్ని - నారి సారించి వదలిన బాణం వంక చూసినట్టు - చూస్తోంది నారి సీతా మనోహరి!

**(ఆంధ్రభూమి, ఆదివారం 18.8.2013)**